www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం
26 జూన్ 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రాజకీయాలు, సామాజిక
అంశాలపై అవగాహన ఉండి..
రాయగల వారికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# డెడ్ లైన్ 90 రోజులు



## స్థానిక ఎన్నికల నిర్వహించాలంటూ హైకోర్టు ఆదేశం

### 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తి చేయాలి

**కలంజ్యోతి, హైదరాబాద్:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మాధవి బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను కూడా పరిగణలోకి తీసుకున్నట్టు ధర్మాసనం తెలిపింది. అందులో భాగంగానే మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో

మిగతా 2 లో

## విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

**సీఎం రేవంత్ రెడ్డి**

- ఐఏఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి
- పాఠశాలల్లో అవసరమైన మేర నూతన గదులు నిర్మించాలి
- పాఠశాలల్లో సోలార్ కి చెన్లు ఏర్పాటు చేయాలి
- పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి

**కలంజ్యోతి, హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో సీఎం బుధవారం

మిగతా 2 లో



## కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

### బీసీ చేతి వృత్తుల ప్రదర్శనలో డిప్యూటీ సీఎం భట్టి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ట్యాంక్ బండ్ పై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్ ను

మిగతా 2 లో

## డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిస్తాం

- హైదరాబాద్ ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్
- డ్రగ్స్ కేసులపై కఠినంగా వ్యవహరించాలి
- డి ఎడిక్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



2 లో



## డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిస్తాం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. దాని కోసం ఎన్ని కఠిన నిర్ణయాలైనా తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలని ఆయన హితవుపలికారు. పిల్లలు చెడు మార్గంలో వెళ్లకుండా తల్లిదండ్రులు నిరంతరం పిల్లల ఆలోచనలు విధానాలను ఎప్పటికప్పుడు నిశితంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ శాఖ లాండర్ ఆర్డర్ తో పాటు డ్రగ్స్ కేసులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. సమాజ హితం కోసం డ్రగ్స్ నిర్మూలనకై ముందుకు రావాలని అలాగే డ్రగ్స్ వాడే వారి వివరాలను 1908 కి కాల్ చేయాలని అలాగే రాష్ట్రం నషాముక్త్ ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం డి ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో వీటి ద్వారా మాదకద్రవ్యాలు వాడే వారికి చికిత్స తో పాటు అవగాహన కల్పిస్తారని మంత్రి తెలిపారు. మాదకద్రవ్యాలను నివారించటంలో రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డు కూడా వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ - నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు అలాగే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలు నిర్దేశించిన విధంగా చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతలు కాపాడడంతో పాటు మాదకద్రవ్యాల పై కూడా ప్రత్యేక నిఘా పెంచి విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. యువత చెడు వైపు వెళ్లకుండా మంచి మార్గాన్ని ఎంచుకొని జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై సూర్య తేజ నిర్మించిన షార్ట్ ఫిలింను యువతతో పాటు మంత్రులు ఉన్నతాధికారులు తిలకించి వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. తర్వాత ర్యాలీని ప్రారంభించిన యువత చేయి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, వయోవృద్ధుల శాఖ సంచాలకులు శైలజ, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్, అదనపు సీపీసుధీర్ బాబు, ఏడి రాజేందర్, సినీ నటుడు నిఖిల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

మొదటిపేజీ తరువాయి

సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సీఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని ఆదేశించారు. సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అధికారులకు తెలియజేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని తెలిపారు. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

## డెడ్ లైన్ 90 రోజులు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దానిపై గత కొన్ని నెలలుగా వాదనలు కొనసాగుతున్నాయి. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది.

**పిటిషనర్ల వాదనలు..**

గతేడాది జనవరి 31తోసర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలని వాదనలు వినిపించారు.

**ప్రభుత్వం తరపున..**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఎన్నికల సంఘం సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ తెలిపారు. ఇది పూర్తి కాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం ఇచ్చాక .. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దానిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

## కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

మొదటిపేజీ తరువాయి

భట్టి విక్రమార్క మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చేతివృత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని,హైదరాబాద్ నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనను తిలకించి నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ల పై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలు మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు పూసల వారి సామగ్రి, పోచంపల్లి, గద్వాల,నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు ,వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సీఎం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెస్త సోదరులు ఏర్పాటుచేసిన చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కలిసి డిప్యూటీ సీఎం ఆరగించారు.

కలంజ్యోతి 3
గురువారం 26.06.2025 General News

# ఆరునూరైనా 'బనకచర్ల'ను అడ్డుకుంటాం

- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఈ నెల 30 న ప్రజాభవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- మేడిగడ్డ, అన్నారం, సిందిళ్ళ బ్యారేజి ల పునరుద్ధరణకు కన్సల్టెంట్ గా ఎన్డీఎస్ఏ
- వెంటనే నాగార్జున సాగర్ లో పూడిక తీత
- నీటిపారుదల శాఖాలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- ఆధుని సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్ బీసీ పనుల పునరుద్ధరణ
- రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులు
- టన్నేల్ నిర్మాణంలో నిష్ణాతులైన వారి నియామకానికి కసరత్తు
- నీటిపారుదల శాఖా సలహదారుడిగా జనరల్ హార్బల్ సింగ్ కు అహ్వానం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరిబంకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని తేల్చి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందొనన్న అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. ఇందులో భాగంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరిబంకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ప్రయోజనాలకు జరిగే నష్టం పై ఈ నెల 30 న ప్రజాభవన్ లో మద్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం ఎర్రమంజిల్ కాలనీ లోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో ఆయన నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్రమ ప్రాజెక్టును ఎలా అడ్డుకోవాలో అనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్ట్ తో తెలంగాణా కు సంభవించనున్న ముప్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలసి ఈ నెల 19 న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ కు వివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఇచ్చామన్నారు. బంకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ఫ్రీఫిజిబిలిటీని నివేదికను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని తేల్చిచెప్పామన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా రాష్ట్ర నీటి కేటాయింపులపై ప్రభావం చూపుతుందని దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని కోరామన్నారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించ లేదని,త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. టన్నెల్ నిర్మాణాల్లో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాదికారులిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇటీవల రోహ్తంగ్,జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటి పారుదల శాఖా కసరత్తు చేస్తుందన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్‌చీఫ్ గా పనిచేసిన జనరల్ హార్బల్ సింగ్ ను తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహాదారుడిగా ఉండమని అహ్వానించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మోహ్రా జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మెడిగడ్డ ,అన్నారం,సిందిళ్ళ బ్యారేజిలపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికలపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ధరణ పనులకు ఎన్డీఎస్ఏ డిజైన్ కన్సల్టెంట్ గా వ్యహారిస్తుందన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు. కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు. డిండి ప్రాజెక్ట్ పై ఆయన మాట్లాడుతూ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు.

**ఎస్ఎల్బీసీ పురోగతిపై...**

శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్.ఎల్.బి.సి)పనుల పురోగతిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. పునరుద్ధరణ పనుల కోసం అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీ లతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో పునరుద్ధరణ పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్ లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని,బదిలీల తంతును వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టులలో పూడిక తీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో పూడి పోయి ఉన్నందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్ధ్యం తగ్గిన నేపద్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్,నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నాగార్జునసాగర్ పూడిక తీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు.ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులను సూచించారు. దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజిలను రూపొందించే అంశలపై అధికారులు దృష్టిసారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో నీటి పారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ మహమ్మద్ అంజత్ హుస్సేన్,ఈఎన్సీ అండ్ మెయింటనెన్స్ డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ లతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి వైన్స్ షాప్‌ను తరలించాలని గ్రామస్తుల ఆగ్రహం

**యువత చెడిపోవడానికి వైన్స్ షాప్ ఏ కారణం అంటున్న గ్రామస్తులు**

**కలం జ్యోతి చెన్నారావు పేట:** ఉప్పరపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ ఉండడంవల్ల గ్రామ యువత చెడు అలవాట్లకు,మద్యానికి బానిసలై బలైపోతున్నారని గ్రామంలోనీ పలు సంఘాల, రాజకీయ నాయకులు యువకులు, ఉద్యోగులు వ్యాపారవేత్తలు, వ్యవసాయదారులు గ్రామ పెద్దలు ఆరోపిస్తున్నారు.. తక్షణమే ఈ వైన్ షాపును తరలించాలని లేనిచో ఆందోళనకైనా వెనకాడబోమని పలు సందర్భాల్లో ఈ విషయంపై చర్చించడం జరిగిందని అంటున్నారు. ఇటీవల కాలంలోనే యువత మద్యానికి అలవాటు పడి యాక్సిడెంట్ రూపంలో మరణించడం జరిగిందని అంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం పరంగా ఎక్సైజ్ శాఖ స్పందించి తగిన చొరవ తీసుకుని వైన్ షాప్ ను తరలించాలని అంటున్నారు.



## ఆక్రమణకు గురైన స్మశాన వాటిక స్థలం

**కలం జ్యోతి చెన్నారావుపేట** : చెన్నారావుపేట్ మండల కేంద్రంలో ఎస్ సి కాలనిలో ఉండబడినటువంటి సర్వే నంబర్ (356/174) 3 ఎకరాల పై చిలుకు భూమిని ఆక్రమణ జరిగిన విషయం గూర్చి ఈరోజున సంబధిత తహసిల్దార్ ను కలిసి దరఖాస్తు ఇవ్వడం జరిగింది . అయన దరఖాస్తును స్వీకరించి వారం రోజులలోగా పరిష్కారం చూపుతనని హామీ ఇవ్వడం జరిగింది ఈ విషయంపై స్పందించక పోతే తదుపరి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బర్ల దేవదాస్ సాధు నర్సింగ రావు ఆకులపెల్లి ఉప్పాలయ్య బార్ల స్వామి నార్మెట్ట సాంబయ్య సాధు రాజు సింగిరెడ్డి అనిల్ జంగిలి రాజేష్ మధాశి ప్రవీణ్ పాల్గొన్నారు.



## ఘనంగా రైతు భరోసా సంబరాలు

కలం జ్యోతి , మల్యాల : మండల కేంద్రంలో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారము 9000 కోట్లను 9 రోజులలో సుమారు 93 లక్షల రైతుల ఖాతాలో జమ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్ గౌడ్, దారం అదిరెడ్డి, ముత్యం శంకర్, దొంగ ఆనంద రెడ్డి,వెల్మ లక్ష్మారెడ్డి,శనిగరపు తిరుపతి,విరబత్తిని ప్రసాద్ , మురళి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**కలం జ్యోతి నర్సాపూర్:** నర్సాపూర్ నియోజకవర్గంలో శివంపేట మండల కేంద్రమైన లో వెలసిన బంగాళముకి దేవాలయంలో బుధవారం నాడు అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని పూజ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ శ్రీదేవి అనుగ్ర ఆశీస్సులతో సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో రైతులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ మాజీ జెడ్పిటిసి మహేష్ గుప్తా టిఆర్ఎస్ నాయకులు మహేందర్ చంద్రకళ శ్రీశైలం యాదవ్ శ్రీనివాస్ రెడ్డి వీరేశం లక్ష్మణ్ సమీర్ సాకేత్ చెకింగ్ పాల్గొన్నారు.



# నేటి నుంచి ఆషాఢ బోనాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన సర్కార్
- గోల్కొండ అమ్మవారికి మొదటి బోనం
- వచ్చే నెల 21 వరకు జాతర ఉత్సవాలు
- బంగారు బోనమెత్తనున్న నిషా క్రాంతి



**కలంజ్యోతి, హైదరాబాద్:** హైదరాబాద్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఆషాఢ మాస బోనాల జాతర నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు గురువారం గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మవారికి సమర్పించే మొదటి బోనంతో ప్రారంభమవుతున్నాయి. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కి భక్తులు బోనాలు సమర్పించనున్నారు. జూలై 20న పాతబస్తీతో పాటు నగరంలో అంగరంగ వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు జరగనున్నాయి. జూలై 21న పాతబస్తీలో భక్తి శ్రద్ధలతో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు, తదనంతరం మారు బోనంతో ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేసింది. పాతబస్తీలో నిర్వహించే బోనాల జాతరకు మరో రూ.10 కోట్ల నిధులను అదనంగా కేటాయించాలని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు.

### కన్నుల పండుగగా జాతర ఏర్పాట్లు

ఉత్సవాల్లో భాగంగా సప్త మాతృకల సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహ కాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సిద్ధమైంది. ఈసారి బంగారు బోనం ఏడు గుళ్లకు కాకుండా.. కేవలం మూడు దేవాలయాలకు మాత్రమే పరిమితమవుతోంది. గోల్కొండ జగదాంబ అమ్మవారితో పాటు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు, బల్కంపేట ఎల్లమ్మ తల్లికి నిషా క్రాంతి బంగారు బోనాన్ని సమర్పించనుంది. ఇక విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ తల్లికి జోగిని శ్యామల బంగారు బోనాన్ని ఎత్తనుండగా... మరో జోగిని అవికా పెద్దమ్మ తల్లి, చార్మినార్, లాల్ దర్వాజా అమ్మవార్లకు బంగారు బోనాలు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నిర్వాహకుల ద్వారా సమర్పించనున్నారు.

### ప్రాంతాల వారీగా బోనాలు

జూన్ 26న గోల్కొండ అమ్మవారికి సమర్పించే మొదటి బంగారు బోనంతో ఈసారి ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సప్తమాతృకల సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా గోల్కొండ అమ్మవారికి మొదటి బోనం సమర్పించనున్నారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ తరపున శ్రీ జగదాంబికా అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు పాత్రలో మొదటి బోనాన్ని సమర్పించనున్నారు. 29న విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారికి 2వ బంగారు బోనం సమర్పించనున్నారు. జులై 2న బల్కంపేట అమ్మవారికి మూడో బంగారు బోనం, జులై 4 న జుబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి నాలుగో బోనం. జులై 10న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి 5వ బంగారు బోనం. 15న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆరో బంగారు బోనం. 17న లాల్ దర్వాజా సింహ వాహిని అమ్మవారికి చివరి 7వ బంగారు బోనం సమర్పించనున్నారు.

### గోల్కండలో ప్రారంభమైన సందడి

చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో బోనాల ఏర్పాట్లు మొదలయ్యాయి. దేవాదాయ శాఖ అధికారులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గోల్కొండ కోట వద్ద నీటి ట్యాంకర్లు, క్యూలైన్ల కోసం తాత్కాలిక బారికేడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయానికి వెళ్లే దారిలో రోడ్లుకు మరమ్మతులు చేపడుతున్నారు. గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారి ఆలయం తెలంగాణలో బోనాల ఉత్సవాలకు ప్రసిద్ధి చెందాయి. బుధవారం అమావాస్య కావడంతో గోల్కొండలోని జగదాంబికా ఆలయ మార్గంలోని మెట్లకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.



# సీబీఎస్ఈ 'పది' పరీక్షలు రెండుసార్లు

## ప్రకటించిన పరీక్ష కంట్రోలర్ భరద్వాజ్

**న్యూ ఢిల్లీ :** పదవ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలను 2026 నుంచి రెండుసార్లు నిర్వహినున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిబంధనలను ఆమోదించిందని పరీక్ష కంట్రోలర్ భరద్వాజ్ ప్రకటించారు. మంగళవారం ఆయన మీడియాకు ఈ విషయాన్ని తెలిపారు. ఆమోదించిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు బోర్డు పరీక్షల మొదటి దశకు హాజరు కావడం తప్పనిసరి అని చెప్పారు. రెండో దశ ఐచ్ఛికంగా ఉంటుందన్నారు. తొలిదశ పరీక్ష ఫలితాలు ఏప్రిల్ లో, రెండో దశ ఫలితాలు జూన్ లో ప్రకటిస్తామని చెప్పారు. ఒక విద్యార్థి రెండు దశల పరీక్షలకు హాజరు కావాలని, పదో తరగతి మూల్యాంకనం ఒక్కసారి మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పరీక్ష కంట్రోలర్ సీబీఎస్ఈ రెండు దశల పరీక్షలపై ఉన్న అపోహలను తొలగించడంతో పరీక్షల నిర్వహణపై ఉన్న అనుమానాలకు తెరదించినట్లయ్యింది.

# అభినందన్‌ను బంధించిన పాక్ మేజర్ హతం!



**ఇస్లామాబాద్ :** వింగ్ కమాండర్ అభినందన్ ను బంధించానని చెప్పుకున్న పాక్ మేజర్ హతమయ్యాడు. బుధవారం వజీరిస్థాన్ లోని టీటీపీకి పాక్ సైన్యానికి మధ్య జరిగిన ఎన్ కౌంటర్ లో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా మృతి చెందాడు. ఈ ఎన్ కౌంటర్ లో టీటీపీకి చెందిన 11 మందిని చంపినట్లు పాక్ సైన్యం ప్రకటించింది. మేజర్ అబ్బాస్ తోపాటు మరో మేజర్ లాన్స్ నాయక్ జిబ్రాన్ కూడా మృతి చెందినట్లు ప్రకటించింది. పాక్ భద్రతా దళాలు వజీరిస్థాన్ జిల్లాలోని సరోఘా ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఈ ఎన్ కౌంటర్ జరిగింది. 2019 లో వింగ్ కమాండర్ అభినందన్ ఆపరేషన్ చేపట్టి తిరిగి వస్తుండగా విమానం కూలిపోయింది. ముందే అభినందన్ కిందకు దిగాడు. ప్రజలు ఆయన్ను పట్టుకొని పాక్ సైన్యానికి అప్పగించారు. తానే అభినందన్ ను పట్టుకున్నానని అప్పట్లో మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ మేజర్ ప్రస్తుతం టీటీపీ దాడిలో మృతి చెందాడు. కాగా, అప్పట్లో అభినందన్ భారత్ మిగ్ 21తో ఎఫ్-16ను వెంబడించి మరీ కుప్పకూల్చడం కొసమెరుపు. మిగ్ సాధారణ యుద్ధ విమానం. అదే సమయంలో ఎఫ్-16 అత్యాధునిక యుద్ధ విమానం కావడంతో అప్పట్లో ఈ విమానం కూల్చివేతపై పుంఖానుపుంఖాలుగా వార్తలు వచ్చాయి.

కలంజ్యోతి
గురువారం 26.06.2025 General News 5

# త్యాగ వీరుల గౌరవ తీర్మానానికి
# కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఎమర్జెన్సీని 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నాం
- పూణే మెట్రో విస్తరణ, జార్ఖండ్ మాస్టర్ ప్లాన్, పొటాటో కేంద్రం
- యూపీలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటుకు నిధుల విడుదలకు ఆమోదం
- కేబినెట్ వివరాలను వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



**కలంజ్యోతి, న్యూ ఢిల్లీ:** ఎమర్జెన్సీలో త్యాగాలు చేసిన వీరులను గౌరవించే తీర్మానాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదిచింది. వీరి త్యాగాలపై మౌనం పాటించింది. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రి వర్గం బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. మంత్రి వర్గ భేటీ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డ, అసామాన ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రాణలను సైతం పోగొట్టుకున్న వారికి నివాళులర్పించామన్నారు. 1975 జూన్ 25 అత్యవసర పరిస్థితిని విధించి 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నామని చెప్పారు. ఆ సమయంలో ప్రాణాలర్పించిన, ప్రతిఘటించిన వ్యక్తుల త్యాగాలను స్మరించుకొని గౌరవించాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించిందన్నారు. భారత గణతంత్రం, ప్రజాస్వామ్య స్ఫూర్తిపై దాడి చేయడం, సమాఖ్య వాదాన్ని అణగదొక్కడం, ప్రాథమిక హక్కులు, మానవ స్వేచ్ఛపై పోరాడిన వ్యక్తుల అసమాన ధైర్య సాహసాలను కొనియాడామన్నారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య విలువల స్థితి స్థాపకత పట్ల ప్రజలు దృఢ విశ్వాసాన్ని కొనసాగిస్తున్నామన్నారు. నియంతృత్వ ధోరణులు, రాజ్యాంగాన్ని రక్షించడం వృద్ధులకు ఎంత ముఖ్యమో, యువతకు కూడా అంతే ముఖ్యమని తీర్మానం పేర్కొందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టుకోవడాలనే సంకల్పాన్ని పునరుద్ధరించుకుందామని పేర్కొన్నారు.

**కేబినెట్ నిర్ణయాలు..**

కేబినెట్ సమావేశంలో పూణే మెట్రో విస్తరణకు రూ.3,626 కోట్లను మంత్రి వర్గం ఆమోదించిందన్నారు. ఇందులో రెండు కొత్త కారిడార్లు వనాజ్ నుంచి చందాని చౌక్ (కారిడార్ -2ఏ), రాంవాడి నుంచి వాఘోలి/విఠల్వాడి (కారిడార్ -2బీ). ఈ కారిడార్లు దశ-1 కింద అభివృద్ధి చేయబడిన ప్రస్తుత వనాజ్-రాంవాడి లైన్ పొడిగింపులుగా పేర్కొన్నారు. జార్ఖండ్ భూగర్భ అగ్ని ప్రమాదానికి సంబంధించి రూ.5,940 కోట్లతో సవరించిన మాస్టర్ ప్లాన్ ను ఆమోదించామన్నారు. బొగ్గుక్షేత్రంలో అగ్నిప్రమాదం, భూమి క్షీణత, బాధిత కుటుంబాల పునరావాసం వంటి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సవరించిన మాస్టర్ ప్లాన్ ను ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించింది. ఆగ్రాలో రూ. 111 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ బంగాళదుంప (పొటాటో) కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కేంద్రం ఆగ్రాలోని సింగ్నాలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. బంగాళాదుంప రంగంలో పరివర్తనాత్మక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధ నగర్‌లో రూ. 417 కోట్ల ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ (ఈఎంసీ 2.0) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఈఎంసీ 200 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. సుమారు రూ.2,500 కోట్ల కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. 15,000 కొత్త ఉద్యోగాలను సృష్టించనుంది.

# హమాస్ బాంబు దాడుల్లో ఐడీఎఫ్ సైనికులు దుర్మరణం!

**గాజా స్ట్రిప్:** హమాస్ గాజాలో ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా జరిపిన పేలుళ్లలో ఏడుగురు ఐడీఎఫ్ సైనికులు మరణించారు. దాడికి బాధ్యత వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ గాజా నగరమైన ఖాన్ యూనిస్ లో ఐడీఎఫ్ సాయుధ వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులకు తెగబడ్డారు. కాగా మంగళవారం ఈ పేలుడు జరిగిందని, బుధవారం ఐడీఎఫ్ అధికారి మీడియాకు వివరించారు. ఒక భవనంలో ఉన్న ఐడీఎఫ్ సైనికులపై మెరుపుదాడులకు దిగారని హమాస్ సైనిక విభాగం




అల్ ఖాసిమ్ ప్రకటించారు. రెండు క్షిపణులను ఈ భవనంపై ప్రయోగించారని అన్నారు. పేలుడు తరువాత కాల్పులు జరిపారన్నారు. కాగా దాడులు ఎక్కడ జరిగాయనేది స్పష్టం కాకున్నా ఏడుగురు ఐడీఎఫ్ సైనికులు మృతి చెందారన్నది మాత్రం వాస్తవమేనని, ఇందుకు హమాస్ బాధ్యత వహించిందని స్థానిక మీడియా ప్రకటించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి జరిగినప్పటి నుంచి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 56వేలకు పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, గాజా సిటీ మొత్తం 80 శాతం ధ్వంసమైంది. పలు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ పాగా వేసింది. ఈ ఆపరేషన్ లో ఇజ్రాయెల్ కూడా 860మందిని కోల్పోయింది. మరోవైపు ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం సద్దుమణిగి ఒక్కరోజు కూడా కాలేదు. హమాస్ ఐడీఎఫ్ పై విరుచుకుపడడంతో పరిస్థితులు మళ్లీ ఎటువైపు దారితీస్తాయో అన్న ఆందోళన నెలకొంది.



# వీడియో కాల్ మాట్లాడు ప్లీజ్

- మహిళా ఉద్యోగులను పీఆర్‌సీఈ వేధింపులు
- మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీకి బాధితుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన మంత్రి

కలంజ్యోతి, హైదరాబాద్ : కిందిస్థాయి ఉద్యోగులతో శాఖాపరంగా పనులు చేయించుకోవాల్సిన పంచాయత్ రాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వరిస్తున్న చీఫ్ ఇంజినీర్ (సీఈ) తప్పటడుగులు వేశారు. కామంతో కళ్లు మూసుకుపోయి అమానవీయంగా ప్రవర్తించాడు. కిందిస్థాయి మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించాడు. తమను శారీరకంగా వేధించడంతో పాటు పగలు, రాత్రి వీడియో కాల్స్ చేసి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారంటూ బాధిత ఉద్యోగులు బుధవారం మంత్రి సీతక్కతో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. అతడి వేధింపులు తాళలేకపోతున్నామని తమ గోడు విన్నవించుకున్నారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మంత్రి సీతక్క విచారణ జరిపించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజనకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





# జులై 1న విచారణకు రండి

- అరవింద్ కు ఏసీబీ నోటీసులు
- ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ దూకుడు
- కేటీఆర్ సమాధానాల ఆధారంగా అరవింద్ విచారణ
- కేటీఆర్ అరెస్ట్ కు బలపడుతున్న అనుమానాలు

**కలంజ్యోతి, హైదరాబాద్:** ఫార్ములా -ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో -ఏ2గా ఉన్న అప్పటి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ కు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. జులై 1న విచారణకు రావాలని ఆదేశించింది. కాగా, ప్రస్తుతం అరవింద్ కుమార్ విదేశాల్లో ఉన్నారు. ఈ నెలాఖరు వరకు ఆయన తిరిగి తెలంగాణకు రానున్నట్లు తెలిసింది. ఈ కేసులో గత జనవరిలోనే ఏసీబీ, ఆ తర్వాత ఈడీ విచారించింది. ఈ క్రమంలో ఐదు నెలల సుదీర్ఘ విరామం తర్వాత జూన్ 16న కేటీఆర్ ను ఏసీబీ మరోసారి విచారించింది. ఈ నేపథ్యంలో ఈ నోటీసులు వెలువడడం ఆసక్తిగా మారింది. కాగా.. గతంలో అరవింద్ కుమార్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఏసీబీ గత వారం కేటీఆర్ ను విచారించింది. బిజినెస్ రూల్స్, అగ్రిమెంట్లు, స్పాన్సర్లు, ఆర్థిక శాఖ అనుమతులు ఇలా వివిధ అంశాలపై కేటీఆర్ నుంచి కీలక సమాచారం రాబట్టిన విచారణ అధికారులు ఈసారి కేటీఆర్ చెప్పిన సమాధానాల ఆధారంగా అరవింద్ కు ప్రశ్నించబోతున్నట్లు తెలుస్తున్నది. అవసరం మేరకు కేటీఆర్, అరవింద్ ను ఉమ్మడిగా విచారించే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో తాజా నోటీసులతో ఈ కేసులో ఏం జరగబోతున్నది అనేది ఆసక్తి రేపుతున్నది. అయితే ఈ ఫార్ములా - ఈ కార్ రేస్ నిర్వహణ వ్యవహారం, ఒప్పందాలు అన్ని తానై కేటీఆర్ వ్యవహరించారని గతంలో అరవింద్ కుమార్ వాంగ్మూలం ఇచ్చారు. ఈ సారి దర్యాప్తులో ఆయన చెప్పబోయే విషయాల ఆధారంగా కేటీఆర్ అరెస్టు ఉంటుందనే చర్చ హాట్ టాపిక్ గా మారింది.





### బోయ్ ఫ్రెండ్ తో కలిసి

# కెమెరాకు చిక్కిన జాన్వీ కపూర్!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఆమె తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహారియాతో కలిసి లండన్‌లో పర్యటిస్తున్నారు. ఇటీవల సినిమాల నుంచి కాస్త విరామం దొరకడంతో, ఆ సమయాన్ని ఆమె తన ప్రియుడితో గడుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలోనూ ఈ జంట ముంబైలోని రెస్టారెంట్ల వద్ద, తిరుమల శ్రీవారి దర్శన సమయంలోనూ కలిసి కనిపించిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం వీరిద్దరూ లండన్ వీధుల్లో కలిసి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ఎవరో అభిమాని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతోంది. ప్రైవసీ కోసం లండన్ వెళ్లినా, అభిమానుల కంటపడకుండా జాన్వీ తప్పించుకోలేకపోయారు. ఈ వీడియో చూసిన పలువురు నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తున్నారు.